అంగన్‌వాడీ టీచర్లు లేక అవస్థలు

- పెట్రాంచెలకలో టీచర్లు లేక పదేళ్లు
- టీచర్లు 2, హెల్పర్లు ఐదు ఖాళీలు

టేకులపల్లి: తల్లీబిడ్డలకు పోషకాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మూడేళ్ల లోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలను ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా చేసి వారికి కావాల్సిన ఆరోగ్య సలహాలు, పోషకాహారాన్ని అందిస్తుంటారు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు. అయితే టేకులపల్లి మండలంలో టీచర్లు, హెల్పర్ల కొరత కారణంగా పక్క కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లపై పనిబారం పడుతోంది. టేకులపల్లి మండలంలో మెయిన్ 77, మినీ 49 మొత్తం 126 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గర్భిణులు 410, బాలింతలు 425, మూడేళ్లలోపు పిల్లలు 1,778, మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలు 1,380 మంది ఉన్నారు.

మండలంలోని పెట్రాంచెలక, సర్వన్‌బోడు కాలనీ (గుత్తికోయలకాలనీ) కేంద్రాల్లో టీచర్లు, మద్దిరాలతండా, మద్రాస్‌తండా, బోడుకొత్తగూడెం, ఆర్‌సీపేట, శంభునిగూడెం కేంద్రాల్లో హెల్పర్లు మొత్తం 2 టీచర్లు, 5 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పెట్రాంచెలక కేంద్రంలో పదేళ్ల క్రితం అక్కడ పని చేస్తున్న టీచర్ మృతి చెందడంతో ఖాళీగా ఉంది. పెట్రాంచెలక స్టేజీలో ఇన్‌చార్జ్ టీచర్ ఉన్నారు. దీంతో ఈ టీచర్‌తో పాటు హెల్పర్‌పై పనిబారం పడుతోంది. సుమారు మూడేళ్ల క్రితమే అంగన్‌వాడీల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నియామకపు ప్రక్రియ ప్రారంభించారు. అయితే పలువురు కోర్టును ఆశ్రయించడంతో నియామకాలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పెట్రాంచెలక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో హెల్పర్

ఖాళీలు భర్తీ చేయాలి



టేకులపల్లి మండలంలో రెండు అంగన్‌వాడీ టీచర్లు, ఐదు హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సుమారు పదేళ్ల నుంచి ఖాళీగా ఉండడంతో స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి నియామకాలు చేపట్టాలి.

– కొండపల్లి శకుంతల,
సీఐటీయూ మండల కన్వీనర్, టేకులపల్లి

నియామకాలు నిలిచి పోయాయి



టేకులపల్లి మండలంలో మెయిన్ 77, మినీ 49 మొత్తం 126 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 2 టీచర్, ఐదు కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాం. కోర్టు నుంచి స్టే రావడంతో నియామకాలు నిలిచిపోయాయి.

– కేఎం తార, సీడీపీఓ, టేకులపల్లి ప్రాజెక్టు

క్లుప్తంగా

వైల్డ్ లైఫ్ పెండింగ్ పనులపై సమీక్ష

పాల్వంచరూరల్: కిన్నెరసాని అభయారణ్యంలోని వైల్డ్‌లైఫ్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ కట్టా దామోదర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధి యానంబైల్ రేంజ్‌లోని కిన్నెరసాని డీర్ పార్క్ వద్ద సోమవారం వైల్డ్ లైఫ్ డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఎఫ్‌డీఓ గతేడాది పెండింగ్ పనులను సమీక్షించారు. వేసవిలో అడవిలో అగ్నిప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని అందుకోసం ఫైర్ లైన్స్‌ను బీట్ల వారిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో యానంబైల్ రేంజర్ శ్రీనివాసరావు, చాతకొండ రేంజర్ శ్రీనివాసరెడ్డి, అళ్లపల్లి రేంజర్ నర్సింహారావు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

జూలూరుపాడు: గుండెపుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్ కోసం ఇదే గ్రామానికి చెందిన హైదరాబాద్ సివిల్ కోర్టు జడ్జి కాళ్లూరు ప్రభాకర్‌రావు సోమవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామసర్పంచ్ బానోత్ నరసింహారావు చేతుల మీదుగా హైస్కూల్ హెచ్‌ఎం వి.లలిత భవానీకి నగదు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. చదివిన పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో జడ్జి తండ్రి కాళ్లూరు వెంకటేశ్వరరావు, గ్రామస్తులు దుద్దుకూరి సుమంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టీ సప్లై చేస్తూ జీవనం సాగిస్తున్న పి.కళావతికి ఈనెల 26న గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా వచ్చిన రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీజీఎంఎస్) వి.లక్ష్మీనారాయణ, కళాశాల వివిధ విభాగాధిపతులు, సిబ్బంది రూ.పదివేలను సోమవారం కళాశాల ప్రిన్సిపల్ నాగముని నాయక్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి

ఇల్లెందు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పురోభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన పర్రె శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్య తగ్గి కళాశాల నడవటం కష్టంగా మారిందని, తగిన సలహాలు, సూచనలు కోసం స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ సహకారంతో ముందుకు సాగుతామన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీని పరిచయం చేశారు. అధ్యక్షుడిగా పర్రె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అర్వపల్లి రాధాకృష్ణ, సభ్యులుగా గుమ్మడి విద్యాసాగర్, సుబ్బారావు, బండి సతీష్, బ్రహ్మాజీరావు, సురేష్, సత్యనారాయణ, అశోక్, అబ్దుల్లా, రమేష్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ, ఇంద్రాణీ, శేఖర్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్‌పీ బస్తీ రాజీవనగర్‌తండా పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రాంతంలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. నబీ మాట్లాడుతూ.. గూడు లేని నిరుపేదలు ప్రభుత్వ ఖాళీ స్థలంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, వారికి కనీస సౌకర్యాలు కల్పించకుండా గ్రామపంచాయతీ పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణం స్పందించి సౌకర్యాలు కల్పించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, రాందాస్, కౌసల్య, గాబ్రియా, ప్రసాద్, రజియా, ఖాదర్, సంతోష్, విజయ, సుధాకర్, లలిత, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓపై చర్యలు తీసుకోండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెర్రా కామేష్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా చెవిలో పువ్వులు పెట్టుకుని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ మండలాలలో ఏజెన్సీ నిబంధనలకు వ్యతిరేకంగా పంచాయతీరాజ్ చట్టాలకు విరుద్ధంగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా భూబదలాయింపు చేస్తున్నారని ఆరోపించారు. పరోక్షంగా వెంచర్లు వేసిన వారికి సహకరిస్తున్న ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. భూబదలాయింపులలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని కోరారు. అదేవిధంగా జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండేలా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో సాయి, అల్లకొండ శరత్, పాల్వంచ మండల అధ్యక్షుడు జెట్టి ఆనందరావు, నాగుల రవికుమార్, వంగా రవిశంకర్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధికి మెరుగైన వైద్యం


పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

టేకులపల్లి: కుష్టు వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, నివారణకు మెరుగైన వైద్యం, మందులు అందుబాటులో ఉన్నాయని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఫిబ్రవరి 13 వరకు 15 రోజుల పాటు నిర్వహించే కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పీహెచ్‌సీలో, రాంపురం పంచాయతీలో సమావేశాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. కుష్టు విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనుమానాలు పెట్టుకోవద్దని మందులకు పూర్తిగా నయం అవుతుందని, ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా మెరుగైన వైద్యం, విలువైన మందులు ఇస్తారని తెలిపారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వ్యాధి మొత్తం తగ్గే వరకు మందులు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అనుమానాస్పదమైన, స్పర్శ లేని, రాగి రంగు మచ్చలు లాంటివి కనిపిస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి వ్యాధి నిర్ధారణ జరిగితే వెంటనే చికిత్స ప్రారంభించడం వల్ల ఎలాంటి అంగవైకల్యం లేకుండా బయటపడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాణోతు సరోజిని, సర్పంచ్ భూక్యా ఇందిర, కార్యదర్శి సందీప్, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, రాంబాబు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల జేఏసీ కమిటీ నియామకం


సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ ఎన్నికల సాధన కమిటీ కన్వీనర్‌గా సయ్యద్ రషీద్, కోకన్వీనర్‌గా అరుద్ర సత్యనారాయణ, కోఆర్డినేటర్‌గా బాడిశ భిక్షం నియామకమయ్యారు. సోమవారం స్థానిక వర్తక సంఘ భవన్‌లో యువతరం పార్టీ అధ్యక్షుడు పొట్రు ప్రవీణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వార్డుల విభజన ప్రభుత్వ పరిధిలో ఉందని అధికారులు దాటవేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి వార్డుల విభజన పూర్తి చేయాలని తక్షణం పాల్వంచకు ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికోసం అన్ని పార్టీలు, యూనియన్లు, ప్రజా సంఘాలు, ప్రజలను కలుపుకుని పోతామన్నారు.

కార్యక్రమంలో వర్తక సంఘం కన్వీనర్ చలువాది ప్రకాష్, శనగ రామచందర్‌రావు, గౌస్ బాషా, రెహమాన్, బుడగం నాగేశ్వరరావు, శ్రీకృష్ణ నాయకులు పాల్గొన్నారు.

తనిఖీ చేసే అధికారమెక్కడిది?

టేకులపల్లి: సొంత గ్రామంలో పని చేసుకోకుండా దిశ కమిటీ పేరుతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసే అధికారం మద్రాస్ తండా సర్పంచ్ మాళోతు రాజేందర్‌నాయక్‌కి ఎవరిచ్చారని, స్వార్థంతో, స్వలాభం కోసం పాఠశాలలను తనిఖీ చేస్తుండటం విడ్డూరంగా ఉందని బద్దు తండా ఎంపీటీసీ ఊకె రామకృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ సీహెచ్.అరుణ, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తుమ్మలచెలక పాఠశాలలో చుట్టు పక్కల పాఠశాలల టీచర్లు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఇటీవల సామ్యాతండా, తుమ్మలచెలక పాఠశాలలను రాజేందర్ తనిఖీ చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధి, ఎంఈఓ, డీఈఓ, ఇతర మండల, జిల్లా స్థాయి అధికారులకు మాత్రమే పాఠశాలల్లో రిజిష్టర్ తదితర అంశాలు తనిఖీ చేసే అధికారం ఉంటుందన్నారు. తనిఖీ పేరుతో ఉపాధ్యాయులను బెదిరించడం, మధ్యవర్తుల ద్వారా డబ్బులు ఆశిస్తున్నారని ఆరోపించారు. మరోసారి ఇలా వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఉన్నతాధికారులు స్పందించి దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మణ్, టీచర్లు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మణి, ఉమామహేశ్వరి, హైమావతి, సరిత, నవ్య, చంద్రకళ, కృష్ణవేణి, సారమ్మ, చంటి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


తుమ్మలచెలక పాఠశాలలో సమావేశమైన ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

5న ఇఫ్టూ మహాసభ

ఇల్లెందు: ఫిబ్రవరి 5న ఇల్లెందులో జరగనున్న ఇఫ్టూ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఇఫ్టూ అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ రాసుద్దీన్ కోరారు. సోమవారం ఇల్లెందులో జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. మోటార్ వాహన చట్టం అమలు చేయాలని, 8 గంటల పని విధానం, బోనస్ పెంపు, దుస్తులు అందజేత వంటి అనేక డిమాండ్లు అమలు కోరుతూ జరిగే ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయ్, శ్యామ్, శంకర్,రఘు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు నిధులు కేటాయించాలి

పాల్వంచ: ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడాలని, బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును కోరారు. సోమవారం స్థానిక పాత పాల్వంచలో ఎమ్మెల్యే వనమాను సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న, కె.సత్యల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంగన్‌వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా 70వేల మంది ఉద్యోగులు నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తున్నారని, వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం లేదన్నారు. బీఎల్ఓ డ్యూటీల వల్ల అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందించడం లేదన్నారు. కార్యక్రమంలో రహీం, మాధవి, శారద, అచ్చమ్మ, నాగమణి, ధనలక్ష్మి, పద్మ, శైలజ, రాజకుమారి, నిర్మల, జ్యోతి, రజిని, జరీనా, భవానీ తదితరులు పాల్గొన్నారు.

చలో అసెంబ్లీని జయప్రదం చేయండి

టేకులపల్లి: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 6న నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాయల ఇందిర పిలుపునిచ్చారు.

ఈ మేరకు సోమవారం టేకులపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 40 సంవత్సరాల నుంచి గౌరవ వేతనంతో గొడ్డు చాకిరీ చేస్తున్నా నేటికీ గుర్తింపు లేదని వాపోయారు. కార్యక్రమంలో పద్మ, సంధ్య, సునీత, మల్లీశ్వరి, ఈశ్వరమ్మ, అరుణ, సుగుణ, రాంబాయ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జీవితం అందరికీ ఆదర్శం


పాల్వంచ: కేటీపీఎస్‌లో నివాళులు అర్పిస్తున్న సీఈ వెంకటేశ్వరరావు, ఉద్యోగులు

ప్రభుత్వ విద్యాలయాలు, కార్యాలయాలు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం చేతులు కలిపిన చాలామందికి గాంధీజీ మార్గదర్శకత్వం ఆదర్శమన్నారు. – సాక్షి నెట్‌వర్క్


టేకులపల్లిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ


ఇల్లెందురూరల్: మహాత్ముడికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు


సుజాతనగర్: పార్టీ జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ఇల్లెందు: పూలమాల వేస్తున్న డాక్టర్ రవి

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మున్సిపాలిటీలోని పలువురు లబ్ధిదారులకు సుమారు రూ.77.8 లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ.. పేదింటి ఆడపడుచులకు ఈ పథకం వరమన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు ఏకష్టమొచ్చినా అండగా ఉంటానని, తుదిశ్వాస వరకు ప్రజాసేవ చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, తహసీల్దార్ రామకృష్ణ, ఉర్దూఘర్ కమిటీ చైర్మన్ అన్వర్‌పాషా, కౌన్సిలర్లు కోలాపురి ధర్మరాజు, పరమేష్ యాదవ్ పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వనమా

అమలుకాని ఆదివాసీ చట్టాలు


మాట్లాడుతున్న వజ్జా సురేష్

సుజాతనగర్: ఆదివాసీల అస్థిత్వంపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జిల్లా అధ్యక్షుడు వజ్జా సురేష్ ఆరోపించారు. ఆ సంఘం ఆధ్వర్యంలో నాయకులు మూతి రామకృష్ణ అధ్యక్షతన కోయగూడం గ్రామంలో సోమవారం మండల మహసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హక్కులు, చట్టాలకు ఆదివాసీలు దూరం అవుతున్నారని, ఆదివాసీల మనుగడపై దాడులు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఆదివాసీలను రాజకీయంగా, సామాజికంగా అణచివేస్తున్నారని, ఓటర్లుగా మాత్రమే ఆదివాసీలను పరిగణిస్తూ వారి అభివృద్ధికి కృషి చేయడం లేదన్నారు. ఏజెన్సీ చట్టాలను దూరం చేస్తూ ఆదివాసీ భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ ఆదివాసీలకు అన్యాయం చేయడం తగదన్నారు. ఐక్యంగా ఉంటూ పోరాటాలు చేయడం ద్వారా తమ మనుగడను సాధించుకోవచ్చని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, సర్పంచ్ కంగల చంద్రకళ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గౌరీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

జూలూరుపాడు: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ సూచించారు. మండలంలోని భేతాళపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు చేయించుకున్న లబ్ధిదారులకు కళ్లజోళ్లు అందజేశారు. మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజలు కంటి సమస్యతో బాధపడొద్దని సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఎంపీపీ లావుడ్యా సోనీ, సర్పంచ్ గుగులోతు రాందాస్, పీహెచ్‌సీ డాక్టర్ తేజస్వినితో పాటు లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, పొన్నెకంటి సతీష్‌కుమార్, యల్లంకి సత్యనారాయణ, వేల్పుల నరసింహారావు, రోకటి సురేష్, చౌడం నరసింహారావు పాల్గొన్నారు.


కళ్లద్దాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

అంజయ్య మృతికి సంతాపం..

భేతాళపాడుకు గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బొడ్డు అంజయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే రాములునాయక్ ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు మాళోత్ రాందాస్ నాయక్, బొడ్డు కృష్ణయ్య, మాలోత్ మంగీలాల్ నాయక్, నున్నా కృష్ణయ్య, ఎంపీపీ లావుడ్యా సోనీ తదితరులు కూడా నివాళులర్పించి అంజయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అప్రకటిత విద్యుత్ కోతలు నిలిపివేయాలి



ఇల్లెందురూరల్: కొమరారంలో ధర్నా చేస్తున్న న్యూడెమోక్రసీ కార్యకర్తలు

ఇల్లెందురూరల్: అప్రకటిత విద్యుత్ కోతలు నిలిపివేయాలని, ఏసీడీ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ నాయకులు సోమవారం మండలంలోని కొమరారం, చల్లసముద్రం సబ్‌స్టేషన్ల ఎదుట ధర్నా చేశారు. ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులపై ప్రభుత్వం పరోక్షంగా ఏడాది వ్యవధిలో అనేకమార్లు చార్జీలు వసూలు చేస్తోందని విమర్శించారు. ఏసీడీ చార్జీల బారం పేద, మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కార్యక్రమంలో బొగ్గారపు సంగయ్య, సూర్నపాక నాగేశ్వరరావు, బానోత్ సంతు, మూడు మాలు, జోగ కృష్ణ, కోడి శ్రీరాములు పాల్గొన్నారు.

పాల్వంచ: ఏసీడీ పేరుతో విద్యుత్ వినియోగదారులపై అదనపు చార్జీలను ఉపసంహరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు, కోశాధికారి జక్కుల రాంబాబు మాట్లాడుతూ.. ఏసీడీ బిల్లు ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు అదనపు భారం పడుతోందని, దీంతో విద్యుత్ వాడలేని పరిస్థితుల్లోకి వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జక్కుల రాంబాబు, వీరమల్ల ఉమ, సట్టు రామచంద్రు, కల్లెం కళింగ, సోమ రాంరెడ్డి, పెరుగు వీరన్న, ఈశ్వర్ పాల్గొన్నారు.

జాబ్ కార్డుల కోసం నగదు వసూళ్లు

సుజాతనగర్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మంజూరైన జాబ్‌కార్డు ఇచ్చేందుకు ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.50 వసూలు చేసినట్లు వెల్లడైందని డీఆర్‌పీ నివేదికలో చదివి వినిపించారు. రెండో విడత సామాజిక తనిఖీలో భాగంగా నాయకులగూడెం, రాఘవాపురం, నర్సింహాసాగర్, సర్వారం, సీతంపేట గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభల సందర్భంగా తనిఖీల్లో నమోదైన విషయాలను డీఆర్‌పీలు చదివి వినిపించారు. సర్వారంలో సుమారు 280 మంది కూలీల వద్ద నుంచి జాబ్ కార్డుల కోసం నగదు వసూలు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఒకే వ్యక్తికి పలురకాల పథకాలు మంజూరైనట్లు గుర్తించామన్నారు. నాయకులగూడెం గ్రామ పరిధిలో 100 ఎవెన్యూ ప్లాంటేషన్‌లో 100 శాతం మొక్కలు నాటినట్లు ఉండగా 60 శాతం మాత్రమే మొక్కలు ఉన్నట్లు తేలిందని చెప్పారు. కొన్ని ఇళ్లలోల ఇంకుడు గుంతలు పూడ్చివేసినట్లు, ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా సీతంపేటలో వర్షాకాలంలో ట్యాంకర్‌కు చెల్లింపులు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ రాంబాబు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

హరితహారం మొక్కలేవీ..?

టేకులపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మూడేళ్ల క్రితం నాటిన హరితహారం మొక్కలు ఒక్కటీ కనిపించడం లేదు. పర్యావరణ పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హరితహారం పథకంలో భాగంగా ప్రతి సంవత్సరం మొక్కలు నాటుతున్నారు. వాటిని గ్రామ పంచాయతీలు సంరక్షిస్తుంటాయి. అయితే టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో నాటిన మొక్కలు ప్రస్తుతానికి ఏపుగా పెరిగి పార్క్‌లా ఉండాల్సింది. ప్రహరీ లేకపోవడంతో మేకలు, పశువులు వచ్చి వాటిని తనేయడంతో ప్రస్తుతం కార్యాలయం ఆవరణలో ఒక్క మొక్క కూడా లేకపోవడం గమనార్హం.



ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వచ్చిపోయే మండలవాసులు అంటున్నారు. – టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: జేఎల్ గణేష్ గాంధీ,
ఎంపీఓ, టేకులపల్లి
సెల్ నంబర్: 9948169879